సాక్షి
పల్నాడు

గురువారం • 6 • జూలై • 2023



అమ్మవారికి ఆషాఢం సారె

నరసరావుపేట రూరల్: ఆషాఢమాసం సందర్భంగా ఇస్సప్పాలెం మహంకాళి అమ్మవారికి ఎమ్మెల్యే సతీమణి, జిల్లా ఉన్నతాధికారుల సతీమణులు సారె సమర్పించారు.



సహకార సంఘాలను ఆధునికీకరించాలి

గుంటూరు వెస్ట్: వ్యవసాయ సహకార సంఘాలను ఆధునికీకరించాల్సి అవసరముందని జేసీ జి.రాజకుమారి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు.



తిరుపతమ్మకు సారె సమర్పణ

పెనుగంచిప్రోలు: ఆషాఢమాసం సందర్భంగా తిరుపతమ్మవారికి బుధవారం హిందూ ప్రచార సమితి ఆధ్వర్యంలో సమరసత సేవా ఫౌండేషన్ వారు సారె సమర్పించి, బోనాలు చెల్లించారు.

న్యూస్‌రీల్


డివిజన్ పరిధిలో పలు రైళ్లు రద్దు

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో అభివృద్ధి పనులు జరుగుతున్న నేపథ్యంలో పలు రైళ్లను రద్దు చేయడం జరిగిందని గుంటూరు డివిజన్ సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్ బుధవారం వెల్లడించారు. గుంటూరు - కాచిగూడ (17251), గుంటూరు - తిరుపతి(17261), మచిలీపట్నం - ధర్మవరం (17215), సికింద్రాబాద్ - గుంటూరు(17254) రైళ్లు ఈనెల 6వ తేదీన రద్దు చేయడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా కాచిగూడ - గుంటూరు(17252), తిరుపతి - గుంటూరు (17262), ధర్మవరం - మచిలీపట్నం(17216) రైళ్లు ఈనెల 7వ తేదీన రద్దు చేయడం జరిగిందని తెలిపారు. ప్రయాణికులు గమనించి సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

గుంటూరు డివిజన్ మీదుగా ప్రత్యేక రైళ్లు

లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే ప్రయాణికుల సౌకర్యార్థం సాంబరం, ధన్‌బాద్ - సాంబరం వయా గుంటూరు డివిజన్ మీదుగా ప్రత్యేక రైళ్లు కేటాయించినట్లు గుంటూరు డివిజన్ సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్ బుధవారం వెల్లడించారు. తాంబరం, ధన్‌బాద్ (06077) రైలు ఈనెల 7న ప్రత్యేక రైలును కేటాయించినట్లు తెలిపారు. ఈరైలు సాంబరం స్టేషన్‌నుంచి శుక్రవారం రాత్రి 10 గంటలకు బయల్దేరి ధన్‌బాద్ స్టేషన్‌కు సోమవారం ఉదయం 5.30 గంటలకు చేరుకుంటుందన్నారు. ధన్‌బాద్- తాంబరం (06078) ప్రత్యేక రైలు ఈనెల 11న కేటాయించినట్లు వెల్లడించారు. ఈరైలు మంగళవారం ధన్‌బాద్‌లో మధ్యాహ్నం 3.35గంటలకు బయల్దేరి తాంబరం స్టేషన్‌కు బుధవారం రాత్రి 10 గంటలకు చేరుకుంటుందని తెలిపారు. ఈరైలు చెన్నై ఎగ్మోర్, సూళ్లూరుపేట, నెల్లూరు, ఒంగోలు, తెనాలి, గుంటూరు, మిరియాలగూడ, నల్గొండ, సికింద్రాబాద్, మేడ్చల్, కామారెడ్డి, నిజామాబాద్ మీదుగా ప్రయాణిస్తుందని తెలిపారు.

53,538 బస్తాల మిర్చి విక్రయం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 49,472 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 53,538 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.23,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.26,000 వరకు పలికింది. ఏసీ కామన్ రకం మిర్చి క్వింటాళకు రూ.10,500 నుంచి 23,000 వరకు ధర లభించింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ. 10,000 నుంచి రూ. 26,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.6,000 నుంచి రూ.14,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 16,850 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

హక్కులు, విధులపై అవగాహన అవసరం



నరసరావుపేట రూరల్: ప్రతి విద్యార్థి హక్కులు, విధులు తెలుసుకోవాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. నెహ్రూ యువకేంద్ర ఆధ్వర్యంలో జిల్లాస్థాయి యువజన ఉత్సవాలు-2023 నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు ముఖ్యఅతిథులుగా పాల్గొని జ్యోతిప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ విద్యార్థులు మంచి అలవాట్లను అలవర్చుకొని జీవితాంత కొనసాగించాలన్నారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలు అవుతున్నదా లేదా వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వినియోగించుకోవాలని తెలిపారు. స్టెప్ సీఈఓ పల్లవి, కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, కార్యదర్శి మిట్టపల్లి రమేష్, ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నారాతో సంబంధం లేదు

- ఫౌండేషన్ కార్యక్రమాల్లో పాల్గొనవద్దు
- ఉల్లంఘిస్తే క్రమశిక్షణ చర్యలే
- టీడీపీ పల్నాడు అధ్యక్షుడు జీవీ హెచ్చరిక
- చిలకలూరిపేట 'దేశం'లో చిచ్చు తారస్థాయికి...
- గుంటూరు సీనియర్ల ఎత్తుగడతో బాబు, లోకేష్‌లకు షాక్



సాక్షి, ప్రత్యేక ప్రతినిధి: పార్టీ జాతీయ అధ్యక్షుడి ఇంటి పేరు (నారా)తో ఫౌండేషన్ ఏర్పాటుచేసి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తే రాజకీయంగా అన్నివిధాలా కలిసొస్తుందని 'భాష్యం' వేసిన భారీ ఎత్తుగడ బెడిసికొట్టింది. విరాళాల పేరిట పార్టీకి, సేవ అంటూ ప్రజలకు డబ్బులు విరజిమ్మితే మేలు జరుగుతుందనుకుంటే అది కాస్తా తిరగబడింది. కాదు... కాదు... ఉమ్మడి గుంటూరు జిల్లా టీడీపీ సీనియర్ నాయకులు ఆ మేరకు చేయగలిగారు. తమకు రాజకీయంగా పొగపెడుతున్నారనే అంచనాకు వచ్చిన సీనియర్లు అందుకు తగ్గట్టే వ్యూహాత్మకంగా పావులు కదిపి అధిష్టానం ఆదేశం పేరిట పరోక్షంగా మొన్న ఉయ్యూరి శ్రీనివాస్‌కు, నేడు భాష్యం ప్రవీణ్‌కు చెక్ పెట్టారు. గుంటూరు సీనియర్ల రాజకీయ ఎత్తుగడలకు నారా చంద్రబాబునాయుడు, లోకేష్‌లకు షాక్ తగిలినట్లేనని పార్టీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. తండ్రీకొడుకులు తలచిందొకటి కాగా పరిణామాలు తద్భిన్నంగా ఉన్నాయని, దీన్నిబట్టి చంద్రబాబు, లోకేష్‌లు తలపట్టుకోక తప్పదని పార్టీలోని పలువురు సీనియర్లు వాఖ్యానిస్తుండటం పరిశీలనాంశం.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో టీడీపీ చాలాకాలంగా గుంభనంగా ఉంటోంది. కార్యక్రమాలు నిరాసక్తంగా సాగుతున్నాయి. గుంటూరు లోక్‌సభ సభ్యుడు గల్లా జయదేవ్ అసలు కనిపించడంలేదనేది తెలిసిందే. ఇతర సీనియర్ల పనితీరు నిరాశాజనకమని పలుదఫాలు చంద్రబాబు సీరియస్ అయిన సందర్భాలు లేకపోలేదు. ఈ పరిస్థితుల్లోనే కొత్తవారిని ప్రోత్సహిస్తూ సీనియర్లకు చెక్ పెడుతున్నట్లు సంకేతాలు వ్యక్తమయ్యాయి. ఆర్థికంగా స్థితిమంతుల్ని గుర్తించి సేవా కార్యక్రమాల పేరిట వారిని తొలుత ప్రోత్సహించడం ఆ తరువాత రాజకీయంగా వినియోగించుకోవడం బాబుకు ఆనవాయితీ అని ఆ పార్టీ నేతలే గుర్తుచేస్తుంటారు. ఈ నేపథ్యంలోనే ఉయ్యూరి శ్రీనివాస్ అనే ఎన్‌ఆర్‌ఐని గుంటూరులో సేవా కార్యక్రమాల పేరిట ఉసిగొల్పారు. సంక్రాంతి సందర్భంగా చంద్రబాబు పాల్గొన్న కానుకల పంపిణీ కార్యక్రమంలో తొక్కిసలాట జరగడం, ముగ్గురు పేదలు మృతిచెందడం తెలిసిందే. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం టికెట్ ఆశిస్తున్న సీనియర్లు పలువురు ఆ కార్యక్రమం సందర్భంగా ఎలా వ్యవహరించారో తెలిసిందే. కారణాలేమైనా ఉయ్యూరి శ్రీనివాస్ ఆ తరువాత దాదాపు కనిపించడంలేదు. లోకేష్ మాట ఇచ్చారని, బాబు ఆశీస్సులు తనకే ఉన్నాయనే ధీమాతో భాష్యం ప్రవీణ్ చిలకలూరిపేట స్థానాన్ని ఆశిస్తూ సేవా కార్యక్రమాలను కొన్ని నెలలుగా కొనసాగిస్తున్న సంగతి తెలిసిందే. పార్టీ భారీఎత్తున విరాళం ఇవ్వడం, ఒంగోలులో మహానాడు జరిగినప్పుడు యడ్లపాడు మండల పరిధిలో పెద్దఎత్తున భోజన సదుపాయాలు ఏర్పాటుచేయడం, శిబిరాలు ఏర్పాటు, పంపిణీ కార్యక్రమాలు చేపట్టారు. తన టికెట్‌కే ఎసరు పెడుతున్నారని కంగారుపడిన మాజీమంత్రి పత్తిపాటి పుల్లారావు తనదైన శైలిలో పావులు కదిపారు. నియోజకవర్గంలో తనకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న వారి ద్వారా భాష్యం ఫౌండేషన్ పేరిట కార్యక్రమాలను కొనసాగిస్తున్నారని, తద్వారా పార్టీశ్రేణులకు, ప్రజలకు విభిన్న సంకేతాలు వెళుతున్నాయని చంద్రబాబు, అచ్చెన్నాయుడు, లోకేష్‌ల వద్దకు వెళ్లి మొరపెట్టుకున్నారనేది సమాచారం. దీంతో రంజాన్ తోఫా ఆగిపోయింది. తన పేరిట కాకుండా 'నారా ఫౌండేషన్'తో కార్యక్రమాల నిర్వహణకు ఎలాంటి అడ్డు ఉండదని భాష్యం ప్రవీణ్ వేసిన ఎత్తుగడను సీనియర్లు దెబ్బతీశారు.

> రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు చిలకలూరిపేట నియోజకవర్గంలో నారా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలకు, తెలుగుదేశం పార్టీకి ఎటువంటి సంబంధం లేదని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జి.వి.ఆంజనేయులు బుధవారం అధికారికంగా ప్రకటన జారీచేశారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఈ సంస్థ నిర్వహించే కార్యకలాపాలలో ఎవరూ పాల్గొనవద్దని ఆదేశించారు. ఉల్లంఘించిన వారు ఎంతటివారైనా క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు.
> ఇదిలాఉండగా, ఫేక్ లెటర్ల గురించి కలత చెందవద్దని నారా ఫౌండేషన్ పేరిట బుధవారం పొద్దుపోయాక చిలకలూరిపేటలో ఫ్లెక్సీలు వెలవటం కొసమెరుపు.

సీనియర్లు కూడబలుక్కునే చేశారా?

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పలువురు సీనియర్లకు రానున్న ఎన్నికల్లో టిక్కెట్లు దక్కవనే పుకార్లు షికార్లు చేస్తున్నాయి. అందుకు తగ్గట్లే పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. లోకేష్ ఆశీస్సులతో అంటూ పలువురు రంగంలోకి వస్తున్నారనేది గుర్తించిన సీనియర్లు కూడబలుక్కున్నారనేది విశ్వసనీయ సమాచారం. తమ రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకం అవుతున్న నేపథ్యంలో మౌనం మొత్తానికే చేటు తెస్తుందనేది వారి అవగాహనగా పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. టీడీపీ జనసేన కలిసి పోటీచేస్తే తెనాలి టికెట్‌పై ఆశలు వదులుకోవాల్సిందేనని ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ఇప్పటికే అవగతమైనట్లు ఉంది. టికెట్ ఎలాగైనా సాధించుకోవాలని పోటీలుపడి సత్తెనపల్లిలో కార్యక్రమాలు కొనసాగించిన కోడెల శివరాం, వై.వి.ఆంజనేయులు, శివనాగమల్లేశ్వరరావులకు చంద్రబాబు జెల్ల కొట్టారు. తనను అత్యంత పరుషపదజాలంతో దూషించిన కన్నా లక్ష్మీనారాయణకు సత్తెనపల్లి బాధ్యతలను బాబు అప్పగించారు. ఎంపీగా పోటీచేసి ఓటమిపాలైన రాయపాటికి, ఆయన కుటుంబానికి ఎలాంటి హామీ లేకపోగా, పెదకూరపాడు, గురజాల, వినుకొండ, తాడికొండ, గుంటూరు వెస్ట్ తదితర నియోజకవర్గాల నుంచి కొత్తకొత్త పేర్లు వినిపిస్తుండటంతో సీనియర్లలో కంగారు మొదలైందని పార్టీ వర్గాలు అంటున్నాయి. 'జిల్లా పార్టీ అధ్యక్షుడిగా, మాజీ మంత్రిగా సీనియర్ అయిన పత్తిపాటి పుల్లారావుకే టికెట్‌పై అనుమానం వస్తున్నప్పుడు రేపు మాకైనా అదే పరిస్థితి దాపురించదనే గ్యారంటీ ఏముంది'. అందుకే అధినేతకు మా ఉద్దేశమేంటో తెలియజెప్పాలనుకున్నాం. లోకేష్‌కు చెక్ పెట్టాలని కూడబలుక్కున్నాం అని సీనియర్ నేత ఒకరు 'సాక్షి'కి చెప్పారు. 'మా వద్ద డబ్బులున్నాయి. సేవల పేరిట ఖర్చుపెట్టేస్తాం. టిక్కెట్ తెచ్చేసుకుంటాం... అంటుంటే మేం సీనియర్లుగా చూస్తూ ఉండిపోవాలా? అందుకే అధికారికంగా 'నారా ఫౌండేషన్' కార్యక్రమాలకు చెక్ పెట్టించాం' అని మరో నాయకుడు అభిప్రాయపడటం గుంటూరు టీడీపీలోని తాజా రాజకీయాలకు అద్దం పడుతోంది.



గుంటూరులో భారీ చోరీ

ఓ ఇంట్లో 3 కిలోల బంగారం, 5 కిలోల వెండి ఆభరణాలు, రూ.1.85 లక్షల నగదు అపహరణ



బీరువాను పరిశీలిస్తున్న ఎస్‌ఐ తరంగిణి

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): గుంటూరు నగరం కొత్తపేటలో బుధవారం రాత్రి భారీ చోరీ జరిగింది. కొత్తపేట పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేటలోని మంగళబావి సందులో నివాసం ఉండే సూరినేడి నరసింహారావు, ఆయన కుటుంబ సభ్యులు సాయంత్రం సమయంలో పని నిమిత్తం విజయవాడ వెళ్లారు. తిరిగి రాత్రి 9 గంటల సమయంలో వచ్చి చూసేసరికి తలుపు గడియలు పగులగొట్టి ఉండటం గమనించారు. ఇంట్లోకి ప్రవేశించిన నిందితులు బీరువాలోని సుమారు 3 కిలోల బంగారు ఆభరణాలు, 5 కిలోల వెండి ఆభరణాలు, రూ. 1.85 లక్షల నగదు అపహరించుకుపోయారు. అయితే సాయంత్రం 5 గంటలకు వెళ్లిన బాధితులు, కుటుంబ సభ్యులు రాత్రి 9 గంటలకే తిరిగి వచ్చారు. కేవలం గంటల వ్యవధిలో జరిగిన చోరీ తెలిసిన వారి పనే అయి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు రంగంలో దిగిన కొత్తపేట పోలీసులు సీసీ టీవీ ఫుటేజీ, తదితర అంశాలు పరిశీలిస్తున్నారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించగా, డాగ్‌స్క్వాడ్‌తో పరిశీలన కొనసాగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



తెరిచిఉన్న అల్మరా

ఆస్తి కోసం ముగ్గురి దారుణహత్య

- చిన్నమ్మ, సోదరి, సోదరుడిని హతమార్చిన వైనం
- పల్నాడు జిల్లా సత్తెనపల్లి, ధూళ్లిపాళ్లలో కలకలం రేపిన ఘటనలు



ధూళ్ళిపాళ్లలో ఇంటిలోనే హత్యకు గురైన షేక్ రహీమూన్



చికిత్సపొందుతూ మృతి చెందిన షేక్ మాలింబీ



షేక్ రహిమాన్ (ఫైల్)



షేక్ రహీమూన్ (ఫైల్)

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం ధూళ్లిపాళ్లలో చిన్నమ్మ, ఆమె ఇద్దరు పిల్లలను నరికి చంపిన ఘటన సంచలనం రేకెత్తించింది. సత్తెనపల్లి మండలం ధూళ్లిపాళ్లలో షేక్ రహీమూన్ (65), ఆమె కుమార్తె షేక్ మాలింబి (36), సత్తెనపల్లి పట్టణంలో ఆమె కుమారుడు షేక్‌రహిమాన్ (33) దారుణహత్యకు గురయ్యారు. పూర్తి వివరాలు.. సత్తెనపల్లి మండలం ధూళ్ళిపాళ్లకు చెందిన షేక్ ఖాశీంకు పెద్ద మీరాసాహెబ్, చినమీరాసాహెబ్ కుమారులు. ఆయన మరణానంతరం ఇద్దరు కొడుకులకు చెరో రెండెకరాల పొలం వచ్చింది. ఈ క్రమంలో పెదమీరాసాహెబ్‌కు ముగ్గురు కుమార్తెలు, ఇరువురు కుమారులున్నారు. పెద్ద కుమారుడు ఖాశిం, ఆయన కుమారుడు జాకీర్ వీరి వాటాగా వచ్చిన పొలం మొత్తం అప్పుల కారణంగా అమ్ముకున్నారు. వీరి కుటుంబం సత్తెనపల్లిలో నివాసం ఉంటుంది. చినమీరాసాహెబ్‌కు భార్య రహీమూన్ (65)తో పాటు ఒక కుమార్తె, ఇరువురు కుమారులు. చినమీరాసాహెబ్ నాలుగేళ్ల క్రితం మృతి చెందాడు. దీంతో రహీమూన్ తన ముగ్గురు బిడ్డలతో ధూళ్లిపాళ్లలోనే నివశిస్తుంది. వీరిలో పెద్ద కుమారుడు జబ్బార్ 2021లో కరోనా సెకండ్ వేవ్ సమయంలో మృతి చెందాడు. కుమార్తె షేక్ మాలింబీ (36) ఇంటివద్దే ఉంటుండగా, మరో కుమారుడు షేక్ రహిమాన్ (33) సత్తెనపల్లిలోని ఓ ప్రైవేటు విద్యా సంస్థలో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో వీరందరినీ హతమారిస్తే రెండెకరాల ఆస్తి తనకే వస్తుందని ఆలోచించిన పెదమీరాసాహెబ్ పెద్ద కుమారుడు ఖాశీం బుధవారం తన కుమారుడు జాకీర్‌తో కలిసి ధూళ్లిపాళ్ల వెళ్లాడు. అక్కడ చిన్నమ్మ రహీమూన్, సోదరి మాలింబీని ఇంట్లోనే అతి కిరాతకంగా నరికాడు. రహీమూన్ అక్కడికక్కడే మృత్యువాత పడగా, మాలింబీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. అనంతరం పిడుగురాళ్ల రోడ్డులోని ఎస్‌వీఆర్ దాబా హోటల్ వెనుక ప్రాంతంలో రహిమాన్‌ను పట్టుకుని హతమార్చారు. సత్తెనపల్లి డీఎస్పీ బి.ఆదినారాయణ, రూరల్ సీఐ కోటేశ్వరరావు, ఎస్‌ఐ ఆవుల బాలకృష్ణ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా ఖాశింను పోలీసులు అదుపులోకి తీసుకోగా జాకీర్ పరారీలో ఉన్నట్లు సమాచారం.

పని దినాలు కోటికి పెంచాలి

- అధికారులకు ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు సూచన
- దిశ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ మర్రి, ఎమ్మెల్యేలు గోపిరెడ్డి, నంబూరు, జిల్లా కలెక్టర్, జేసీ



మాట్లాడుతున్న ఎంపీ లావు, వేదికపై ఎమ్మెల్సీ మర్రి, ఎమ్మెల్యేలు గోపిరెడ్డి, నంబూరు, కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: పల్నాడు జిల్లాలో మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం కింద వంద రోజుల పనిదినాలు కల్పించడంతో పాటు మొత్తం పని దినాలు కోటికి పెంచేలా చర్యలు చేపట్టాలని దిశ జిల్లా స్థాయి అభివృద్ధి సమన్వయ మానిటరింగ్ కమిటీ చైర్మన్, పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు పేర్కొనారు. బుధవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్పందన హాలులో జిల్లా ప్రజాపరిషత్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం దిశ కార్యాక్రమం కింద అమలు చేస్తున్న పలు అభివృద్ధి కార్యక్రమాలపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఎంపీ లావు మాట్లాడుతూ వివిధ పనులకు కూడా ఉపాధి పనులు వర్తింపచేయాలని సూచించారు. 2023-24 ఏడాదికి సంబంధించి డిమాండ్ ఆధారంగా సుమారు రెండు వేల ఎకరాల్లో ఉద్యాన పనులు చేపట్టాలన్నారు. అమృత్ సరోవర్ కింద మంజూరైన 75 పనుల విషయమై సంబంధిత అధికారి సమావేశంలో వివరించారు. డిమాండ్ గుర్తించి రానున్న మంగళవారంలోపు వివరాలు అందజేయాలని సంబంధిత అధికారికి చైర్మన్ సూచించారు. అంతేకాకుండా రెండు, మూడు ఎకరాల విస్తీర్ణం గల చెరువులను గుర్తించి వివరాలు అందించాలన్నారు. ఈ - క్రాప్ బుకింగ్ ఎంతవరకు వచ్చింది, గతేడాది ఈ ఏడాదికి పెంపుదల ఉందా అని సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఎరువులు, ఫెర్టిలైజర్ వంటివి కొరత రానీయకుండా చూడాలన్నారు. జాతీయ రహదారులు విస్తరణ, జలజీవన్ మిషన్ వంటి కార్యక్రమాలపై చర్చించారు. దిశ మెంబర్ సెక్రటరీ, జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ మాట్లాడుతూ దిశ కార్యక్రమం కింద కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న జలజీవన్ మిషన్, మహాత్మాగాంధీ ఉపాధి హామీపథకం అమలు, జాతీయ రహదారులు విస్తరణ, రైల్వే పనులు వివరాలు తదితర అంశాల పురోగతిపై చర్చించడమే దిశ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. అనంతరం జిల్లాలో టేక్ హోం రేషన్, ఈ-శ్రమ కార్డులు తదితర అంశాలపై సంబంధిత అధికారులు వివరించారు. నాగార్జునసాగర్ ద్వారా అవసరమైన నీటికోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి తెలంగాణ రాష్ట్రంతో చర్చించి అవసరమైన నీటిని పొందే విధంగా చర్యలు చేపట్టాని సూచించారు. శాసన మండలి సభ్యులు మర్రి రాజశేఖర్, ఎమ్మెల్యేలు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, నంబూరి శంకరరావు పాల్గొని పలు అంశాలపై తమ తమ సమస్యలను వివరించారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్, రోడ్లు భవనాల శాఖ అధికారి రాజానాయక్ తదితరులు పాల్గొన్నారు.

74 మందికి స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి



కౌన్సెలింగ్‌లో పాఠశాలలను కోరుకుంటున్న ఉపాధ్యాయులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 74 మంది ఉపాధ్యాయులు స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి పొందారు. బుధవారం పాత బస్టాండ్ సెంటర్లోని జిల్లా పరీక్ష భవన్‌లో డీఈఓ పి.శైలజ అధ్యక్షతన జరిగిన ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్‌లో భాగంగా స్కూల్ అసిస్టెంట్ విభాగంలో 53 పోస్టులను అర్హులైన సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులతో భర్తీ చేశారు. అదే విధంగా 21 మంది పీఈటీలకు ఫిజికల్ డైరెక్టర్ పోస్టుల్లో ఉద్యోగోన్నతి కల్పించారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో డీఈఓ కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ నిర్మలారాణి, సీనియర్ హెచ్‌ఎంలు ఆవుల తిరుమలేష్, రమేష్, ప్రసాద్, ఉర్దూ డీఐ షేక్ ఖాసిం, ఐటీ సెల్ సిబ్బంది శివనాగేశ్వరరావు, నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు గణితం, ఇంగ్లిష్, భౌతిక, జీవశాస్త్రాలకు ..

ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్‌లో భాగంగా గురువారం ఉదయం 9 గంటలకు గుంటూరులోని జిల్లా పరీక్ష భవన్‌లో స్కూల్ అసిస్టెంట్ గణితం, భౌతిక శాస్త్ర, జీవశాస్త్రంతో పాటు మధ్యాహ్నం 2 గంటలకు ఇంగ్లిష్ పోస్టులను భర్తీ చేసేందుకు అర్హులైన ఎస్జీటీ కేడర్ ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీఈఓ శైలజ తెలిపారు. సీనియార్టీ జాబితాలో ఉన్న ఉపాధ్యాయులు హాజరు కావాలని సూచించారు.

పంటకాలువలోకి పల్టీకొట్టిన స్కూల్ బస్సు

విద్యార్థులకు స్వల్పగాయాలు



ప్రమాదానికి గురైన స్కూల్‌బస్సును క్రేన్ సాయంతో బయటకు తీస్తున్న దృశ్యం

నరసరావుపేట రూరల్: విద్యార్థులతో వెళ్తున్న స్కూల్ బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న పంట కాలువలోకి దూసుకెళ్లి పల్టీకొట్టింది. ఈ ప్రమాదంలో విద్యార్థులకు స్వల్పగాయాలయ్యాయి. పల్నాడు జిల్లా నరసరావుపేట రూరల్ మండలం పమిడిమర్రు సమీపంలో బుధవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. నరసరావుపేట పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలకు చెందిన స్కూల్ బస్సు మండలంలోని పమిడిమర్రు వద్దకు చేరుకోగానే అదుపుతప్పింది. రోడ్డుపక్కనే ఉన్న పంట కాలువలోకి దూసుకెళ్లింది. ఈ సమయంలో బస్సు వేగం తక్కువగా ఉండటంతో పెనుప్రమాదం తప్పింది. పంట కాలువలోకి బస్సు పల్టీకొట్టడంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. విద్యార్థుల అరుపులు, కేకలతో సమీపంలోని గ్రామస్తులు అక్కడికి చేరుకుని బస్సునుంచి విద్యార్థులను బయటకు తీశారు. గాయపడిన విద్యార్థులను 108 వాహనాల ద్వారా పట్టణంలోని ఆసుపత్రులకు తరలించారు. వీరిలో ముగ్గురికి తీవ్రగాయాలు కాగా మిగిలిన విద్యార్థులకు స్వల్పగాయాలు అయ్యాయి.

డ్రైవర్ అజాగ్రత్త వల్లే..

ప్రమాద సమయంలో డ్రైవర్ సెల్‌ఫోన్ మాట్లాడుతూ ఉన్నాడని విద్యార్థులు చెబుతున్నారు. ఈ కారణంగా ఎదురుగా ఎటువంటి వాహనం రాకపోయినా బస్సు అదుపుతప్పినట్టు తెలుస్తుంది. ప్రమాదం సమయంలో బస్సులో దాదాపు 40 మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం సజ్జాపురం, కొప్పరపాలెం, మిన్నెకల్లు గ్రామాలతో పాటు పమిడిమర్రు గ్రామానికి చెందిన విద్యార్థులు బస్సులో ఉన్నారు. బస్సు ప్రమాదంపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని రూరల్ పోలీసులు తెలిపారు. ప్రమాద ప్రాంతాన్ని రవాణా శాఖ అధికారులు పరిశీలించారు. స్కూల్‌కు నోటీసులు జారీచేసి రికార్డులు పరిశీలించిన తరువాత చర్యలు తీసుకుంటామని ఆర్‌టీఓ పరంధామరెడ్డి తెలిపారు.

పశు వైద్య సేవా రథాల్లో ఖాళీలకు దరఖాస్తుల ఆహ్వానం

నరసరావుపేట రూరల్: జిల్లాలో డాక్టర్ వైఎస్సార్ సంచార పశుఆరోగ్య సేవా రథాల్లో ఖాళీ పోస్టుల భర్తీకి ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవా జిల్లా మేనేజర్ అవనిగడ్డ భీష్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్లుగా పనిచేయడానికి బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ విద్యార్హత ఉండాలని స్పష్టంచేశారు. ప్యారా వెట్‌కు డిప్లమో ఇన్ వెటర్నరీ సైన్స్ విద్యార్హతగా పేర్కొన్నారు. 30 ఏళ్లలోపు వయసు ఉండాలని తెలిపారు. పైలెట్ పోస్టుకు టెన్త్ ఉత్తీర్ణతతో పాటు 35 ఏళ్లలోపు వారు అర్హులని, 2 నుంచి 3 ఏళ్ల అనుభవంతో హెవీ డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని వివరించారు. మూడు క్యాటగిరీల్లో 10 చొప్పున 30 పోస్టులు భర్తీ చేస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు జిల్లా మేనేజర్ భీష్మను 9505077887 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఆధిక్యంలో కృష్ణా జట్టు



ఆర్.యశ్వంత్, కృష్ణా బౌలర్

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్కేఆర్బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న అంతర్ జిల్లాల అండర్–19 టెస్ట్ మ్యాచ్‌లో పశ్చిమ గోదావరి జట్టుపై కృష్ణా జిల్లా జట్టు ఆధిక్యం సాధించింది. తొలిరోజు ఓవర్‌నైట్ స్కోర్ ఆరు వికెట్ల నష్టానికి 140 పరుగులతో రెండో రోజు బుధవారం ఆట కొనసాగించిన పశ్చిమ గోదావరి జట్టు మరో 24 పరుగులు జోడించి 164 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. కృష్ణా జిల్లా జట్టు బౌలర్ ఆర్.యశ్వంత్ 61 పరుగులు ఇచ్చి ఐదు వికెట్లు సాధించాడు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన కృష్ణా జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆరు వికెట్లు కోల్పోయి 236 పరుగులు సాధించింది. జట్టులోని టి.వరుణ్ సాత్విక్ కొద్దిలో సెంచరీ చేజార్చుకొని 95 పరుగులు, కె.ఎస్.ఎన్. శ్రీనిశ్చయ్ 72 పరుగులు సాధించారు. పశ్చిమ గోదావరి జట్టు బౌలర్లు సాయితేజ మూడు వికెట్లు, హర్ష రెండు వికెట్లు సాధించారు. ఆట ముగిసే సమయానికి నిఖిల్ 13, యోచన్ రెండు పరుగులతో క్రీజ్‌లో ఉన్నారు. గురువారం మూడో రోజు ఆట కొనసాగనుంది. మ్యాచ్‌ను ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కె.వి.పురుషోత్తమరావు, గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

నాణ్యమైన ఎరువులు, పురుగు మందులే అమ్మాలి

డీలర్ల సమావేశంలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు



మాట్లాడుతున్న ఎంపీ లావు. వేదికపై ఎమ్మెల్సీ మర్రి, జిల్లా కలెక్టర్ శివశంకర్, జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గోపిరెడ్డి, జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాదు, అధికారులు

నరసరావుపేట: రైతుల శ్రేయస్సు దృష్టా వారికి నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల్నే అమ్మాలని పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. జిల్లా వ్యవసాయ, విజిలెన్స్ శాఖల ఆధ్వర్యంలో బుధవారం భువనచంద్ర టౌన్ హాలులో జిల్లాస్థాయి విత్తన, ఎరువులు, పురుగు మందుల డీలర్ల అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీ లావు మాట్లాడుతూ రైతులకు డీలర్లు బ్యాంకర్లు వంటివారన్నారు. వారిని కావాలని మోసం చెస్తే ప్రజా ప్రతినిధులు, అధికారులు రైతుల పక్షాన నిలిచి పోరాడతామని చెప్పారు. రైతులకు నష్టం వాటిల్లకుండా చూడాల్సిన బాధ్యత డీలర్లపై ఉందని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఎల్. శివశంకర్ మాట్లాడుతూ దేశానికి, రాష్ట్రానికి, మన పల్నాడు జిల్లాకు కూడా అన్నం పెట్టే రైతన్నలే ఆధారమని పేర్కొన్నారు. సీజన్‌కు అనుగుణంగా వారికి నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల్ని అందించాలని ఆదేశించారు. ప్రభుత్వం, పోలీస్, విజిలెన్స్ అధికారుల పర్యవేక్షణ తప్పనిసరిగా ఉంటుందన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా డీలర్లు కూడా చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఆయన సూచించారు. జిల్లాలో ఖరీఫ్ సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు వివరాల్ని డీలర్లకు కలెక్టర్ వెల్లడించారు. రైతుల సంక్షేమం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తల్ని శాసనమండలి సభ్యుడు మర్రి రాజశేఖర్, శాసన సభ్యుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జిల్లా ఎస్పీ వై.రవిశంకర్ రెడ్డి తెలియజేశారు. తొలుత అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ. శ్యామ్‌ప్రసాద్, విజిలెన్స్ ఎస్పీ ఈశ్వరరావు, కమిషనరేట్ జేడీ కృపాదాసు, జిల్లా డీలర్ల సంఘం అధ్యక్షుడు నాగిరెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఐ.మురళి, కమిషనరేట్ అధికారులు, డీలర్లు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

- 80 క్వింటాళ్లు సీజ్ చేసిన విజిలెన్స్ అధికారులు
- డీలర్, ఎండీయూ ఆపరేటర్‌పై కేసు నమోదు



నాదెండ్ల పోలీస్‌స్టేషన్ వద్ద అధికారులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

నాదెండ్ల: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. ఇందులో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కె. ఈశ్వరరావు, తహసీల్దార్ కె. నాగమల్లేశ్వరరావు, సీఐ ఎ. శ్రీహరిరావు, ఎస్‌ఐ ఎం. రామచంద్రయ్య, ఎఫ్ఆర్‌వో షేక్ సైదులు, చిలకలూరిపేట సీఎస్‌డీటీ కొండారెడ్డి ఉన్నారు. గణపవరం 1వ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. మంగళవారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో తూబాడు గ్రామ శివారులో రెండు మినీ ట్రక్కుల్లో 160 బస్తాలు (80 క్వింటాళ్లు) బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, నాదెండ్ల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.బియ్యాన్ని సీఎస్‌డీటీ కె. కొండారెడ్డికి అప్పగించారు.

ప్లాస్టిక్ వేలిముద్రతో ఫోర్జరీ



ప్లాస్టిక్ వేలిముద్ర

పట్టుబడిన రేషన్ బియ్యం ఏ రేషన్ డిపో నుంచి తరలిస్తున్నారన్న కోణంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం గణపవరంలోని తొమ్మిది రేషన్ డిపోల్లో విస్తృతంగా తనిఖీలు చేశారు. షాపు నంబర్ 0734041 సంబంధించిన డీలర్ వీరాంజనేయులు వద్ద ఆసక్తి గొలిపే నిజం బయట పడింది. సంబంధిత డీలర్ వద్ద ఎండీయూ ఆపరేటర్ పి. వీరయ్య ప్లాస్టిక్ వేలిముద్రలను స్వాధీనం చేసుకున్నారు. వాస్తవంగా రేషన్ కార్డుదారులకు ఎండీయూ ఆపరేటర్ ఆధ్వర్యంలో రేషన్ పంపిణీ చేయాల్సి ఉంది. అయితే, ఈ సమయంలో ఎండీయూ ఆపరేటర్‌కు బదులు డీలర్ అక్రమ పద్ధతి ద్వారా ఫోర్జరీకి పాల్పడుతున్నాడు. ఈపోస్ మిషన్‌లో ఎండీయూ ఆపరేటర్ నకిలీ ప్లాస్టిక్ వేలిముద్రను వేసి బియ్యాన్ని అక్రమంగా పంపిణీ చేస్తున్నాడు. దీంతో సదరు రేషన్ డీలర్, ఎండీయూ ఆపరేటర్‌పై సెక్షన్ 120బీ, 409, 420 సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ప్రభుత్వాన్ని, కార్డుదారుల్ని మోసగిస్తున్న ఇద్దరిపై క్రిమినల్ చర్యలకు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శ్రీహరిరావు తెలిపారు.

లింగ నిర్ధారణ చట్టం పకడ్బందీగా అమలు

కమిటీ సమావేశంలో కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశం



సమావేశంలో వైద్యుడి నుంచి వివరాలు తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: జిల్లాలో లింగ నిర్ధారణ చట్టాన్ని అమలు చేయాలని జిల్లాస్థాయి మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం సాయంత్రం లింగనిర్ధారణ చట్టం, మాతృ మరణాలపై కమిటీ సమావేశం నిర్వహించి, సభ్యులకు ఆయన పలు సూచనలు చేశారు. జిల్లాలో ఇప్పటివరకు 151 ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రులకు లింగ నిర్ధారణ చట్టం పరిధి కింద అనుమతులున్నాయని, ఇవన్నీ చట్టం ప్రకారం రికార్డులు నిర్వహించాలని ఆయన ఆదేశించారు. జిల్లాలో కొత్తగా మూడు స్కాన్ సెంటర్లు, ఎనిమిది రెన్యువల్స్, ఆరు మార్పుల కోసం లింగ నిర్ధారణ చట్టం కింద దరఖాస్తు చేసుకున్నారన్నారు. వీరందరికీ అనుమతులు మంజూరు చేసినట్లు చెప్పారు.

రక్తహీనత లోపంతోనే మాతృ మరణాలు

జిల్లాలో మాతృ మరణాలు ఎక్కువగా రక్తహీనత వల్లే కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. గర్భిణుల్లో హిమోగ్లోబిన్ పెంపొందించేలా హెల్త్ క్లబ్బుల్ని ఏర్పాటుచేసి రక్తహీనతను నివారించాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు. జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం మాతృమరణాలపై జిల్లా స్థాయి సమీక్ష జరిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలైన ముటుకూరు, కారంపూడి, కావూరులకు చెందిన ప్రైవేట్, ప్రభుత్వ గైనకాలజిస్టుల్ని మాతృ మరణాలకు గల కారణాల్ని అడిగి తెలుసుకున్నారు. మాతృ మరణాలు సంభవించిన గర్భిణుల ఎంసీహెచ్ కార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి. శోభారాణి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ బి.గీతాంజలి, గైనకాలజిస్ట్ మంత్రు నాయక్, డాక్టర్ నాగపద్మజ, రెడ్ క్రాస్ సొసైటీ మెంబర్ డాక్టర్ ఎం. వసంతకిరణ్, దిశ డీఎస్పీ యు.రవిచంద్ర, డెప్యూటీ డెమో కె. సాంబశివరావు, షేక్ ఖాజావలి పాల్గొన్నారు.

పిచ్చి కుక్క స్వైరవిహారం



పిచ్చికుక్క కాటుకు గురైన వ్యక్తులు

మాచర్ల: పట్టణంలో బుధవారం ఓ పిచ్చి కుక్క స్వైరవిహారం చేసింది. ఒకే రోజు 24 మందిని కరిచింది. బాధితులు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పాత మాచర్ల నుంచి రామా టాకీస్, ప్రభుత్వాసుపత్రి ఎదురు నుంచి మున్సిపల్ కార్యాలయం వెనుక భాగం మీదుగా పీడబ్ల్యూడీ కాలనీలో పిచ్చి కుక్క కనిపించిన ప్రతి ఒక్కరిపై దాడి చేసింది. వెల్దుర్తి మండలం ఉప్పలపాడుకు చెందిన కుర్రా పోతురాజు, అమరావతికి చెందిన అంజని, తాళ్లపల్లికి చెందిన అమరయ్య, షేక్ సైదా, వేముల నాగేంద్ర, వెంకటేశ్వర్లు, కొమ్ము ప్రేమ్‌కుమార్, కె.అచ్చయ్య, వీర్ల బాబుతో పాటు మరో 11 మంది కుక్కకాటుకు గురయ్యారు. వీరంతా ఒకేసారి హాస్పిటల్‌కు రావడంతో వైద్యులు ప్రథమ చికిత్స అందించారు. పట్టణంలో పిచ్చికుక్క స్వైరవిహారం గురించి తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ తురక కిశోర్, కమిషనర్ రమణబాబు ప్రభుత్వాసుపత్రిలో బాధితుల్ని పరామర్శించారు. అప్పటికప్పుడు పిచ్చికుక్క కోసం ప్రత్యేకంగా ఆరుగురితో బృందాన్ని ఏర్పాటు చేశారు. రాత్రి 6.30 గంటల వరకు పిచ్చికుక్క ఆచూకీ లభించలేదు. ప్రత్యేక వాహనాలతో మున్సిపల్ సిబ్బంది రంగంలోకి దిగినా ఫలితం లేకపోయింది.

మహిళల ఆర్థికాభివృద్ధికి స్త్రీనిధి రుణాలు దోహదం



సదస్సులో పాల్గొన్న అధికారులు

శావల్యాపురం: మహిళలు ఆర్థిక అభ్యున్నతికి స్త్రీనిధి రుణాలు దోహదపడతాయని జిల్లా స్త్రీనిధి అసిస్టెంట్ జనరల్ మేనేజరు రంతు చిన బుల్లెయ్య పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో బుధవారం స్త్రీనిధి రుణాల మంజూరు, ప్రభుత్వ పథకాల అమలు, వీవోఏల పనితీరు, రికవరీలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బుల్లెయ్య మాట్లాడుతూ 2024 ఆర్థిక సంవత్సరానికి గాను జిల్లాలో 28,400 మంది సభ్యులకు రూ.142 కోట్లు రుణాలు ఇవ్వడానికి లక్ష్యంగా ఎంచుకున్నట్లు చెప్పారు. వినుకొండ నియోజవర్గానికి రూ. 25 కోట్లు కేటాయించామని తెలిపారు. శావల్యాపురం మండలంలో 25 గ్రామ సమాఖ్యల్లోని 1000 మంది సభ్యులకు రూ. 5 కోట్లు రుణాల్ని ప్రభుత్వం మంజూరు చేసినట్లు చెప్పారు. ఒక్కో గ్రామ సమాఖ్య సంఘానికి అవసరమైతే ఆదనంగా రూ. 75 లక్షల కూడా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. స్త్రీనిధి రుణాలు దుర్వినియోగం కాకుండా, అవకతవకలు జరగకుండా ఇక నుంచి ఆన్‌లైన్‌లో మహిళా సంఘాల్లోని పొదుపు ఖాతాలో చెల్లించి రసీదు పొందాలని ఆయన సూచించారు. జిల్లాలో పైలట్ ప్రాజెక్టు పథకంలో శావల్యాపురం మండలాన్ని ఎంపిక చేశామని, త్వరలో పేటీఎమ్ మిషన్ ద్వారా స్త్రీనిధి రుణాల చెల్లింపును మహిళా సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. సమావేశంలో ఏపీఎం జి.వాసుబాబు, సీసీలు ఖాజావలి, గొట్టం రమాదేవి, బేబిరాణి పాల్గొన్నారు.

మోటుపల్లిలో కూలిన 400 ఏళ్లనాటి మండపం

పరిశీలించిన పురావస్తు పరిశోధకుడు శివనాగిరెడ్డి



మండపాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి

చినగంజాం: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రెండు వేల ఏళ్ల చరిత్ర కలిగిన అంతర్జాతీయ రేవు పట్టణం, వర్తక కేంద్రమైన మోటుపల్లిలో 16వ శతాబ్దం నాటి నాలుగు స్తంభాల మండపం కూలింది. చోళుల కాలంలో నిర్మితమై, కాకతీయుల కాలంలో పునరుద్ధరించిన రామాలయం, (ప్రసన్న కేశవాలయం) ముందు ఎడమ వైపు క్రీ.శ. 6వ శతాబ్దంలో విజయనగర వాస్తుశైలిలో నిర్మించిన నాలుగు స్తంభాల మండపం ఇటీవల కురిసిన వర్షాలకు పునాదుల కింద ఉన్న ఇసుక తొలగిపోయి కూలిపోయింది. మోటుపల్లి హెరిటేజ్ సొసైటీ కార్యదర్శి రొండా దశరథరామిరెడ్డి ఇచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలాన్ని ప్రముఖ పురావస్తు శాఖ పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోటుపల్లి ఓడ రేవుకు రెండు వేల ఏళ్ల చరిత్ర ఉందని, దానికి అనుసంధానంగా నిర్మించిన కల్యాణ మండపం నేడు కూలిపోయిందని చెప్పారు. కల్యాణ మండపం నిర్మాణం అత్యద్భుతంగా జరిగిందని, స్తంభాలపై నాగదేవతల శిల్పాలు, కప్పు రాళ్లపై పద్మాలు చెక్కి ఉన్నాయని, వర్షాలకు కూలిన మండపం స్తంభాలు ఒకదానిపై ఒకటి కుప్పగా పడిపోయాయన్నారు. చారిత్రక ప్రాధాన్యం కలిగిన ఈ మండపాన్ని మళ్లీ నిర్మించాలని కమిటీ సభ్యులకు ఆయన విజ్ఞప్తి చేశారు. కూలిన 16వ శతాబ్దం నాటి విజయనగర సామ్రాజ్య మండపాన్ని తిరిగి నిర్మించి చారిత్రక ఆధారాలను నిలబెట్టాలని ఆయన కోరారు. ఆయన వెంట తెలంగాణ బుద్ధవనం ప్రాజెక్ట్ ప్రత్యేకాధికారి మల్లేపల్లి లక్ష్మయ్య, రొండా దశరథరామిరెడ్డి ఉన్నారు.

తాడేపల్లిలో 59.4 మిల్లీమీటర్ల వర్షం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు అత్యధికంగా తాడేపల్లి మండలంలో 59.4 మిల్లీ మీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా తుళ్లూరు మండలంలో 1.2 మి.మీ. పడింది. సగటున 14.1 మి.మీ. వర్షపాతం నమోదైంది. వివరాలు.. కొల్లిపర మండలంలో 38.4 మి.మీ., మంగళగిరి 35.8, దుగ్గిరాల 28.8, తెనాలి 16.8, ప్రత్తిపాడు 14.2, చేబ్రోలు 12.4, పొన్నూరు 10.4, గుంటూరు తూర్పు 7, వట్టిచెరుకూరు 6.6, ఫిరంగిపురం 6.2, పెదకాకాని 5, కాకుమాను 4.4, పెదనందిపాడు 3.6, గుంటూరు పశ్చిమ 2.4, తాడికొండ మండలంలో 1.8 మి.మీ. చొప్పున వర్షం పడింది. జూలై మాసంలో 5వ తేదీ వరకు సాధారణ వర్షపాతం 26.6 మి.మీ. పడాల్సి ఉండగా, ఇప్పటి వరకు 61.9 మి.మీ. వర్షపాతం నమోదైంది. మరో మూడు రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా వర్షాలు పడతాయని అధికారులు ప్రకటించారు.

